కింగ్స్ కమాల్

కోల్‌కతాపై సంచలన విజయం..

చాహల్, యాన్సెన్ విజృంభణ • 112 లక్ష్యఛేదనలో కేకేఆర్ 95 ఆలౌట్

120 బంతుల్లో 112 పరుగులు. ఛేదనలో కోల్‌కతా లక్ష్యమిది! 7.2 ఓవర్లలో 62/2తో లక్ష్యం దిశగా సాఫీగా సాగిన నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌లో ఒక్కసారిగా పెను అలజడి. మణికట్టు మాంత్రికుడు చాహల్ మాయతో ఆ జట్టు.. 22 పరుగుల తేడాతో ఆరు కీలక వికెట్లు కోల్పోయి 13 ఓవర్లకు 79/8గా నిలిచింది. అంతే.. గేమ్ ఆన్! సుదీర్ఘకాలంగా ఐపీఎల్ ఆడుతున్న విండీస్ యోధుడు రస్సెల్ క్రీజులో ఉండటంతో కోల్‌కతా ఆశలు కోల్పోలేదు. కానీ పంజాబ్ మాత్రం పట్టు విడవకుండా యత్నించి డిఫెండింగ్ చాంపియన్స్‌పై సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఐపీఎల్‌లో ఇదే కోల్‌కతాపై అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేధించిన పంజాబ్ స్వల్ప స్కోరును కూడా కాపాడుకుని ఔరా అనిపించుకుంది.

చాహల్ (4/28)

ముల్లాన్‌పూర్ (చండీగఢ్): బ్యాటర్ల మెరుపులు, భారీ స్కోర్ల మ్యాచ్‌ల మధ్య సాగుతున్న ఐపీఎల్‌లో మంగళవారం లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను ఊపేసింది. బంతి గింగిరాలు తిరిగిన ముల్లాన్‌పూర్ పిచ్‌పై పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్‌దే పైచేయి అయింది. ఇరు జట్ల స్పిన్నర్లు వికెట్ల పండుగ చేసుకున్న పోరులో.. కింగ్స్ నిర్దేశించిన 112 పరుగుల స్వల్ప ఛేదనలో కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులకే చేతులెత్తేయడంతో పంజాబ్ 16 పరుగుల తేడాతో గెలిచింది. రఘువంశీ (28 బంతుల్లో 37, 5 ఫోర్లు, 1 సిక్స్), ఆండ్రీ రస్సెల్ (17) పోరాడారు. పంజాబ్ స్పిన్నర్లలో యుజ్వేంద్ర చాహల్ (4/28), యాన్సెన్ (3/17) కేకేఆర్‌ను దెబ్బతీశారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్.. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 15.3 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (15 బంతుల్లో 30, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (3/25) ఆరంభంలోనే కింగ్స్‌ను దెబ్బతీయగా మిస్టరీ స్పిన్నర్లు సునీల్ నరైన్ (2/14), వరుణ్ చక్రవర్తి (2/21) కలిసి మిడిల్, లోయరార్డర్ పనిపట్టారు.

క్యూ కట్టారు..

మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్స్ (12 బంతుల్లో 22, 3 ఫోర్లు, 1 సిక్సర్) దూకుడుగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా ఈ ద్వయం నిష్క్రమించిన తర్వాత ఒక్క రంటే ఒక్కరూ క్రీజులో నిలవలేకపోయారు. నోకియా రెండో ఓవర్లో ఆర్య.. రెండు బౌండరీలు కొట్టగా వైభవ్ మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్.. 4, 6, 4, 4తో 20 పరుగులు రాబట్టాడు. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఇవే తొలి, ఆఖరి మెరుపులు. 4వ ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన హర్షిత్.. ఒకే ఓవర్లో ప్రియాన్స్‌తో పాటు శ్రేయాస్ (0)నూ ఔట్ చేసి ఆతిథ్య జట్టుకు భారీ షాకిచ్చాడు. ఆ మరుసటి ఓవర్లోనే బంతినందుకున్న వరుణ్.. జోష్ ఇంగ్లిష్ (2)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో పంజాబ్ కష్టాలు రెట్టింపయ్యాయి. హర్షిత్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లతో అలరించిన ప్రభ్‌సిమ్రన్ కూడా.. అదే ఓవర్లో ఆఖరి బంతికి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో రమణ్‌దీప్ సింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. అక్కడ్నుంచి పంజాబ్ ఇన్నింగ్స్ కోలుకోలేదు. నోకియా 9వ ఓవర్లో నెహాల్ వధేర (10) రెండు బౌండరీలు బాదినా నాలుగో బంతికి ఔట్ అయ్యాడు. ఇక ఈ సీజన్‌లో అత్యంత చెత్తగా ఆడుతున్న గ్లెన్ మ్యాక్స్‌వెల్ (7) మరోసారి తన వైఫల్య ప్రదర్శనను కొనసాగిస్తూ.. వరుణ్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. సుయాన్ష్ (4), యాన్సెన్ (1)ను నరైన్ ఒకే ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. పంజాబ్ భారీ ఆశలు పెట్టుకున్న శశాంక్ సింగ్ (18)ను 16వ ఓవర్లో అరోరా ఎల్బీగా వెనక్కిపంపగా అదే ఓవర్లో బార్ట్‌లెట్ (11) రనౌట్ అవడంతో కింగ్స్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

రఘువంశీ ఎదురుదాడి

స్వల్ప ఛేదనలో కేకేఆర్ కూడా 7 పరుగులకే ఓపెనర్లను కోల్పోవడంతో పంజాబ్‌లో ఆశలు రేగాయి. యాన్సెన్ తొలి ఓవర్లోనే నరైన్ (4)ను బౌల్డ్ చేయగా ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న బార్ట్‌లెట్.. రెండో బంతికే డికాక్ (2)ను ఔట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు. కానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన రఘువంశీ.. కెప్టెన్ రహానేతో కలిసి కోల్‌కతాను ఆదుకున్నాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన అతడు.. కింగ్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. యాన్సెన్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు కొట్టిన రఘువంశీ.. బార్ట్‌లెట్ ఆరో ఓవర్లో 6, 4తో రెచ్చిపోయాడు.

చాహల్ మాయ..

ఈ సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న చాహల్.. కీలక సమయంలో సత్తా చాటాడు. వరుస ఓవర్లలో అతడిచ్చిన షాకులకు కోల్‌కతాకు కుదేలైంది. తన తొలి ఓవర్లోనే అతడు.. రహానేను వికెట్ల ముందు బలిగొని 55 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. మరుసటి ఓవర్లో రఘువంశీనీ ఔట్ చేసిన చాహల్.. 12వ ఓవర్లో ప్రమాదకర రింకూ సింగ్ (2)తో పాటు రమణ్‌దీప్‌నూ పెవిలియన్‌కు పంపడంతో వన్‌సైడ్ వార్ అనుకున్న మ్యాచ్ కాస్తా ఉత్కంఠగా మారింది. యాన్సెన్ కూడా 13వ ఓవర్లో హర్షిత్ (3)ను బౌల్డ్ చేయగా అర్షదీప్.. వైభవ్‌ను పెవిలియన్‌కు పంపడంతో కేకేఆర్ 9వ వికెట్ కోల్పోయింది. యాన్సెన్.. 16వ ఓవర్లో తొలి బంతికి రస్సెల్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

1 ఐపీఎల్‌లో ఒక జట్టు అత్యల్ప స్కోరును కాపాడుకోవడం ఇదే ప్రథమం. గతంలో చెన్నై (116) పంజాబ్‌తో మ్యాచ్‌లో ఈ లక్ష్యాన్ని కాపాడుకుంది.

ఐపీఎల్‌లో ఒక జట్టుపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో నరైన్ (పంజాబ్‌పై 36 వికెట్లు) అందరి కంటే ముందున్నాడు. గతంలో ఈ రికార్డు ఉమేశ్ యాదవ్ (పంజాబ్ పైనే 35 వికెట్లు) ఉంది.

4 ఐపీఎల్‌లో పంజాబ్‌కు ఇది నాలుగో అత్యల్ప స్కోరు కాగా కేకేఆర్‌పై ఆలౌట్ అవడం ఇది రెండోసారి.

సంక్షిప్త స్కోర్లు

పంజాబ్: 15.3 ఓవర్లలో 111 ఆలౌట్ (ప్రభ్‌సిమ్రన్ 30, ప్రియాన్స్ 22, హర్షిత్ 3/25, నరైన్ 2/14); **కోల్‌కతా:** 15.1 ఓవర్లలో 95 ఆలౌట్ (రఘువంశీ 37, రస్సెల్ 17, చాహల్ 4/28, యాన్సెన్ 3/17)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	6	4	2	8	1.08
ఢిల్లీ	5	4	1	8	0.89
బెంగళూరు	6	4	2	8	0.67
పంజాబ్	6	4	2	8	0.17
లక్నో	7	4	3	8	0.08
కోల్‌కతా	7	3	4	6	0.54
ముంబై	6	2	4	4	0.10
రాజస్థాన్	6	2	4	4	-0.83
హైదరాబాద్	6	2	4	4	-1.24
చెన్నై	7	2	5	4	-1.27

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

అయ్యర్‌కు ఐసీసీ అవార్డు

దుబాయ్: టీమ్‌ఇండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఐసీసీ అవార్డును గెలుచుకున్నాడు. మార్చి నెలకుగాను అయ్యర్‌కు ఈ అవార్డు దక్కింది. భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించిన అయ్యర్.. ఆ టోర్నీలో 243 పరుగులు సాధించాడు. న్యూజిలాండ్ ఆటగాళ్లు జాకబ్ డఫ్ఫీ, రచిన్ రవీంద్ర ఈ అవార్డుకు పోటీపడ్డా అయ్యర్ విజేతగా నిలిచాడు.

వాంఖడేలో రోహిత్ స్టాండ్

- **అజిత్, శరద్ పవార్‌కూ స్టేడియంలో చోటు**

ముంబై: చారిత్రక వాంఖడే స్టేడియంలో స్టాండ్లకు ముగ్గురు ప్రముఖ వ్యక్తులు రోహిత్‌శర్మ, అజిత్ వాడేకర్, శరద్‌పవార్ పేర్లు పెట్టారు. మంగళవారం సమావేశమైన ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు అజింక్యా నాయక్ పేర్కొన్నాడు. దేశ క్రికెట్‌కు సేవలకు గుర్తింపుగా స్టేడియంలో స్టాండ్లకు నామకరణం చేసినట్లు ఎమ్‌సీఏ తెలిపింది. దివేచా పెవిలియన్ లెవల్-3 స్టాండ్‌కు రోహిత్‌శర్మ పేరు పెట్టగా, గ్రాండ్‌స్టాండ్ లెవల్-3కి శరద్‌పవార్, లెవల్-4కు వాడేకర్ స్టాండ్లుగా ఖరారు చేశారు. 2022లో టీమ్‌ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన రోహిత్ 2024 టీ20 ప్రపంచకప్‌తో పాటు ఇటీవల చాంపియన్స్ ట్రోఫీని గెలువడంలో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

బంగ్లా పర్యటనకు షెడ్యూల్ ఖరారు

- **వన్డే, టీ20 సిరీస్ ఆడనున్న భారత్**

ఢాకా: ఈ ఏడాది ఆగస్టులో భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో టీమ్‌ఇండియా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఈ మేరకు తుది షెడ్యూల్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మంగళవారం వెల్లడించింది. ఆగస్టు 17, 20న జరిగే వన్డేలకు మీర్‌పూర్ ఆతిథ్యమివ్వనుండగా చివరి వన్డే (23న)తో పాటు తొలి టీ20 (26న) సైతం చట్టోగ్రామ్‌లో జరుగుతుంది. చివరి రెండు టీ20 (29, 31న)లను మీర్‌పూర్‌లో నిర్వహించనున్నారు. స్వదేశంలో బంగ్లాదేశ్.. భారత్‌తో టీ20 సిరీస్ ఆడనుండటం ఇదే మొదటిసారి. భారత్‌కు ఆతిథ్యమిచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరి తెలిపారు.

కాంబ్లీకి గవాస్కర్ ఆర్థిక సాయం

ముంబై: గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి సునీల్ గవాస్కర్ ఆర్థిక సాయం అందించనున్నారు. గవాస్కర్ 'చాంప్స్ ఫౌండేషన్' తరఫున కాంబ్లీకి నెలకు రూ. 30 వేలతో పాటు వార్షిక వైద్య సాయం కింద ఏడాదికి మరో రూ. 30 వేలు ఇవ్వనున్నారు. నిరుడు డిసెంబర్‌లో మూత్ర సంబంధిత వ్యాధితో బాధపడ్డ కాంబ్లీ కొన్నిరోజులు దవాఖానాలోనే గడిపాడు. నడవడానికీ కష్టంగా ఉన్నా కొంతకాలం క్రితం ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) నిర్వహించిన వాంఖడే 50 సంవత్సరాల వేడుకకు కాంబ్లీ రాగా ఈ కార్యక్రమానికి గవాస్కర్ సైతం హాజరయ్యాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంకుకు క్రాస్టో-కపిల ద్వయం

ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకుకు చేరుకుంది. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో క్రాస్టో-కపిల జోడీ 17వ ర్యాంకుకు ఎగబాకింది. పురుషుల డబుల్స్‌లో మాజీ ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్-చిరాగ్.. 11వ ర్యాంక్‌కు పడిపోగా త్రిసా-గాయత్రి జంట కూడా ఒక ర్యాంక్ దిగజారి పదో స్థానానికి పరిమితమైంది.

రేసింగ్ లీగ్ ప్రచారకర్తగా సల్మాన్‌ఖాన్

హైదరాబాద్: ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ లీగ్(ఐఎస్ఆర్ఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. ప్రపంచంలోనే తొలి ఫ్రాంచైజీ తరహా లీగ్‌గా మొదలైన ఐఎస్ఆర్ఎల్ ఈసారి కొత్త హంగులతో అభిమానుల ముందుకు రాబోతున్నది. ఈనెల 24 నుంచి రైడర్ల రిజిస్ట్రేషన్ మొదలవుతుండగా, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ లీగ్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాడు. వరల్డ్ చాంపియన్‌న జోర్డి టిక్సర్‌తో పాటు మ్యాట్ మాస్, థామస్ రెమెటె లాంటి స్టార్ రేసర్లు లీగ్‌బరిలో దిగనున్నారు.

సినిమాకొచ్చిన బజ్ చూస్తుంటే భయం వేస్తుంది

'శివశక్తి పాత్ర, 'ఓదెల 2' సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్. 20ఏళ్లుగా ఎన్నో ప్రొడక్షన్స్‌లో పనిచేశా. కానీ ఇంత పాషన్ వున్న ప్రొడ్యూసర్స్‌ని, క్రియేటర్స్‌ని చూడలేదు. ఇలాంటి టీమ్ అరుదుగా దొరుకుతుంది. ఈ సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా. 17వ తేదీ కోసం అందరితోపాటు నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని తమన్నా అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల 2'. అశోక్‌తేజ దర్శకుడు. సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణ చేస్తూ.. డి.మధుతో కలిసి ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో శర్వానంద్ అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమాకు వచ్చిన బజ్ చూస్తుంటే భయం వేస్తోంది. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌కీ, రైటింగ్ డిపార్ట్‌మెంట్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. ఈ సినిమాకోసం ఓ రీసెర్చే జరిగింది. ఎన్నో పుస్తకాలను రిఫర్ చేశాం. డైరెక్టర్ అశోక్ వెరీ పాజిటీవ్ సోల్. అతనికి మంచి జరగాలనే 'ఓదెల 2' స్టార్ట్' చేశా. సౌందర్ రాజన్ విజువల్స్, అజనీష్ నేపథ్య సంగీతం ఈ సినిమాను హైలైట్స్. ఓ గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని సంపత్‌నంది తెలిపారు. ఇంకా నిర్మాత డి.మధు, దర్శకుడు అశోక్‌తేజ, నిర్మాత రాధామోహన్, నటుడు వశిష్ట ఎన్.సింహా, ఆర్ట్ డైరెక్టర్ రాజీవ్ నాయర్‌లతోపాటు మరో అతిథి దర్శకుడు వశిష్ట కూడా మాట్లాడారు.

చిత్రం

ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ పూర్తి

'ది ఫ్యామిలీ స్టార్' తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా సినిమా రాలేదు. మధ్యలో 'కల్కి 2898 ఏడీ'లో అర్జునుడిగా మెరిశారు విజయ్. సోలో హీరోగా ఆయన నటించే సినిమాకోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'కింగ్‌డమ్' సినిమా చేస్తున్నారు విజయ్. ఈ సినిమా విడుదలపై అభిమానుల్లో రకరకాల అనుమానాలు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ తన ఇన్‌స్టాలో ఓ స్టోరీ పెట్టారు విజయ్ దేవరకొండ. 'ప్రస్తుతం 'కింగ్‌డమ్' డబ్బింగ్ పనులు జరుగుతున్నాయి. ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ చెప్పేశా. గౌతమ్ ఓ వండర్ క్రియేట్ చేశాడు..' అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. డబ్బింగ్ థియేటర్‌లో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి, తాను చర్చించుకుంటున్న ఓ ఫొటోని కూడా ఈ స్టోరీతోపాటు ఆయన షేర్ చేశారు. ఈ పోస్ట్ చూసి రౌడీ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర వేరే లెవల్లో ఉంటుందని ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్ చెబుతోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవించందర్, నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య.

మళ్లీ యాక్షన్ ఘరూ!

మహేష్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒడిశాలోని పర్వత ప్రాంతాల్లో జరిపిన తొలి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించారు. ఆ తర్వాత షూటింగ్‌కు కాస్త విరామాన్ని ప్రకటించింది చిత్రబృందం. ఈ గ్యాప్‌లో మహేష్‌బాబు, రాజమౌళి ఇద్దరూ విదేశాలకు వెళ్లారు. ఇటలీ విహార యాత్రకు వెళ్లిన మహేష్‌బాబు మంగళవారం హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీ ప్రచారం కోసం రాజమౌళి కుటుంబ సభ్యులతో కలిసి జపాన్ వెళ్లారు. ఆయన వచ్చిన వెంటనే రెండో షెడ్యూల్‌ను మొదలుపెడతారని సమాచారం. ఈ రెండో షెడ్యూల్‌లో కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తారని చెబుతున్నారు. ఇక ఈ సినిమాలో మహేష్‌బాబు..రుద్ర అనే పాత్రలో కనిపిస్తారని వార్తలొస్తున్నాయి. దాదాపు వెయ్యికోట్ల భారీ వ్యయంతో జంగిల్ యాక్షన్ అడ్వెంచర్‌గా నిర్మాత కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

ఎన్టీఆర్ ఆ విషయంలో కాంప్రమైజ్ కావొద్దన్నారు

'ఇది పూర్తిగా కల్యాణ్‌రామ్ కోసమే తయారు చేయించుకున్న కథ. తల్లి పాత్ర కథలో కీలకం. ఆ పాత్రను విజయశాంతిగారితో చేయించాలని ముందే ఫిక్స్‌యాం. అన్నీ పక్కాగా ప్లాన్ చేసుకొని చేసిన ఎమోషనల్ యాక్షన్ ఫిల్మ్ ఇది ' అని నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా వారు నిర్మించిన ఎమోషనల్ యాక్షన్ డ్రామా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. దర్శకుడు ప్రదీప్‌తో ఓ వెబ్ ఫిల్మ్ చేశామనీ, తను కమర్షియల్ మీటర్ తెలిసిన దర్శకుడని, తమ నమ్మకాన్ని నిజం చేస్తూ అద్భుతంగా ఈ సినిమా తీశాడని నిర్మాతలు తెలిపారు. విజయశాంతి పోషించిన వైజయంతి పాత్ర 'కర్తవ్యం' సినిమా స్ఫూర్తితో తీర్చిదిద్దబడిందనీ, కథ వినగానే చిన్న చిన్న మార్పులతో సింగిల్ సిట్టింగ్‌లో ఆమె ఓకే చేశారనీ, కల్యాణ్‌రామ్, విజయశాంతిల పాత్రలు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటాయని నిర్మాతలు చెప్పారు. కథను నమ్మి, కథకు కావాల్సింది మాత్రమే ఖర్చు చేశామనీ, తాము పెట్టిన ప్రతి రూపాయి తెరపై కనిపిస్తుందనీ, కచ్చితంగా మేం అనుకున్న దానికంటే గొప్ప స్పందన వస్తుందని నమ్మకంతో ఉన్నామనీ నిర్మాతలు ఆశాభావం వెలిబుచ్చారు. 'ఈ సినిమా తొలి ప్రేక్షకుడు ఎన్టీఆరే. సినిమా చూసి ఎమోషన్స్, యాక్షన్ అంశాలు బాగా కుదిరాయని అభినందించారు. ఆర్ఆర్ విషయంలో మాత్రం కాంప్రమైజ్ కావొద్దని చెప్పారు. అందుకు తగ్గట్టే అజనీష్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ చెప్పినట్టు సినిమా చివరి 20 నిమిషాలు కళ్లు చెమ్మగిల్లేలా వుంటుంది. ఈ సినిమాలో మూడు ఎపిసోడ్స్ ది బెస్ట్‌గా ఉంటాయి ఆ మూడూ సెకండాఫ్‌లో వస్తాయ్' అని నిర్మాతలు సునీల్ బలుసు, అశోక్ వర్ధన్ ముప్పా పేర్కొన్నారు.

అగ్లీ స్టోరీ స్వరాలు

నందు, అవికా గోర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అగ్లీ స్టోరీ'. ప్రణవ స్వరూప్ దర్శకుడు. సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మాతలు. ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. నిర్మాతలు మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అందులో భాగంగా ఈ సినిమాలో 'హే ప్రియతమా..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ రాసిన ఈ పాటను శ్రవణ్ భరద్వాజ్ స్వరపరిచారు. కాలభైరవ ఆలపించారు. యువతరానికి కనెక్టయ్యేలా ఈ పాట సాహిత్యం, సంగీతం, చిత్రీకరణ సాగింది. నందు, అవికా గోర్‌ల కెమిస్ట్రీ, శ్రీసాయికుమార్ విజువల్స్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణలు. శివాజీరాజా, రవితేజ మహాదాసం, ప్రజ్ఞ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి నిర్మాణం: రియా జియా.

కల ఆధారంగా కథ

'కార్పొరేట్ హాస్పిటల్స్‌లో జరిగే మోసాలను ఈ చిత్రంలో చూపించాం. డాక్టర్స్, పేషెంట్స్‌కు మధ్య ఉండే వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోతే ఎలాంటి దుష్ఫలితాలు సంభవిస్తాయో తెలియజెపుతున్నాం' అన్నారు సుమయ రెడ్డి. ఆమె కథానాయికగా నటిస్తూ నిర్మాతగా, రచయితగా కూడా పనిచేసిన 'డియర్ ఉమ' చిత్రం ఈ నెల 18న విడుదలకానుంది. రాజేష్ మహాదేవ్ దర్శకుడు. ఈ సందర్భంగా కథానాయిక, నిర్మాత సుమయ రెడ్డి మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. కరోనా సమయంలో ప్రతీ రోజు తనకు ఓ కల వచ్చేదని, అది వెంటాడుతున్నట్లుగా అనిపించేదని, ఆ కల ఆధారంగా కథ రాసుకున్నానని తెలిపారు. ఫిక్షనల్ కథే అయినా ఇందులో చక్కటి సామాజిక సందేశం ఉంటుందని, ప్రజల్ని చైతన్యవంతం చేసేలా ఉంటుందని చెప్పారు. రాజ్ తోట కెమెరా విజువల్స్, రథన్ సంగీతం ప్రధానాకర్షణలుగా నిలుస్తాయని సుమయ రెడ్డి పేర్కొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.